# సరళ

బొందిలో ప్రాణాల్నుంత వరకు బొందలు తోడుతూ బతికిన బొందయ్యగ్గూడా బొందకావాలనే నిజం ఆ ఊరి జనాల్లో కలవరం సృష్టించింది.

"మట్టి నుంచి పుట్టిన మనిషి పాణం బోయినంక ఆ కట్టెను మట్టిల వెట్టక నెత్తిలవెట్టు కుంటారా?" అరుగుమీద గోడ కొరిగి కూచున్న అరవయ్యేళ్ల పెద్ద మనిషి సవాలు.

"గిదేమన్నా ఎనకటి కాలమా? బొందవెట్టుడెందుకూ? కాష్టం జెయ్యచ్చుగదా!" ఓ యువకుని సలహా.

"అరేయ్ పిల్లగా!" పెద్దమనిషి మీసాల కింద నవ్వులాంటిది మెరిసింది". "కాష్టం జెయ్యాలంటే చానా కట్టెలు కావాలె. మనిషి పీనుగంటే సామాన్యమా! గన్ని కట్టెలు కొనాలంటే చాలా రూపాయలు కావలెగదరా!" చుట్ట అంటించుకుంటూ చురక వేసిండు. కాలు మీద కాలేసుకుని పూర్తిగా ఒరిగి కూచున్నాడు.

పక్కనే నుంచున్న మల్లమ్మ ముక్కుచీది కొంగుతో తుడుచుకుంటూ" మనూర్లె ఎవలు సచ్చినా బొందల వెడ్తుంద్రు గదా. మనూరి ఆచారమే గది. కొత్త షిరస్తా దెచ్చి కొంపముంచుతరా ఏంది?" మండిపడుతూ ముక్కుమీద వేలేసుకుంది.

"నీ యవ్వ గీ ఆచారాలే మనకు గ్రహచారాలు." పెయ్యంతా కారప్పొడి చల్లినట్టయిందా యువకునికి". "మన చుట్టు పక్క ఊర్లల్ల. పట్నాలల్ల గిట్లనే ఉన్నదా?" నిలదీసిండు.

"లేక పోవచ్చు." మరో వృద్ధునికి రోషం పొడుచ్చుకొచ్చింది. "మనూరి షిరాస్తా మనూరిది. పాపం! ఊర్ల ఎవలు సచ్చినా బొందయ్యనే బొందదోడె గిప్పుడు. బొందయ్యనే సచ్చిపాయె" అరుగు మీద మలుచుకున్న కాళ్లను కిందకు వెళ్లాడేసిండు.

"బొందయ్య సచ్చిపాయె. ఇంగ బొంద ఎవ్వలు తోడ్తరటా? మరో యువకుని ప్రశ్నాబాణం.

పెద్దమనిషి పక్కన కూచ్చున్న మరో వృద్ధుడు రుమాలు సవరించుకుని "అరె నీ యవ్వ.గీ వైసు పోరలకేమైంది?" ఆశ్చర్యం ప్రకటించి బనీను జేబులోంచి చుట్ట, అగ్గిపెట్టేదీసిండు.

"వైసు పోరల సంగతి చెప్తున్నావు గాని ముందు నీ మీసాల సంగతి చూస్కో తాతా! చుట్ట బదులు మీసాలు కాల్చుకుంటవేమో!" మొదటి యువకుని మొహమ్మీద ముసిముసినవ్వు.

జోకు పేలలేదు. మొహం మసిబట్టలాగైపోయింది. రెండో యువకుడు గుర్రు మన్నడు. శవం ముంగట జోకులేస్తవా!" అని నిలదీస్తాన్నాయతని చూపులు.

"చూడు బిడ్డా!" పెద్దమనిషి సర్దుక్కూచున్నడు. కళ్లమీదికొస్తున్న సూర్యకిరణాలను అరచేత్తో అడ్డుకుంటున్నడు. "మహారాజులు చస్తే గంధం చెక్కలతోని కాష్టం జేస్తరు. మనసొంటోళ్లను మామూలు కట్టెల్తోని కాలవెడ్డరు. మామూలే కట్టెలగ్గూడా వందల రూపాయలు కావాలె. పచ్చని చెట్టును నరుకుడు పాపమంటరు గూడా. కాని బొందలు

దోడి, మోటలకు దండెడ తాళ్లు అల్లి బతికినోని పీనుగును కాష్టం జెయ్యాలంటే...ప్చ్...." దమ్ము దీసిండు. అర నిమిషమాగి "అయినా ఇప్పుడు మోటలు లేవు, మొద్దులు లేవు, వాటికి దండెళ్ళు లేవు. వాడేమన్నా పైసలు కూడవెట్టి ఎక్కడనన్నా దాచిపిట్టిండా?" మందలించిండు.

ఆ మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. నిజమే.. అనుకుని ఊపిరి పీల్చుకున్నారు.

మనో వ్యాధికి మందులేదు. ఎదిగిన కొడుకు మీద ఎన్నో ఆశలు పెంచుకున్న బొందయ్యను విధి వెక్కిరించింది. రోజురోజుకు బక్కజిక్క, తిండి సరిగాలేక ఎముకల గూడై పోయిండు. నిన్న మధ్యాహ్నం ప్రాణాలెగిరిపోయినై. కులస్తులంతా ఇంటికొచ్చింద్రు. ఓ రాత్రి భయంకరంగా గడిచింది. తెల్లవారిం తర్వాత శివరామకృష్ణ సేవా సమితి వాళ్లొచ్చి ఓ గంటసేపు భజనజేసి పోయింద్రు. అప్పటికే కరకర పొద్దు పొడిచి మూరెడెక్కింది.

ఆడవాళ్లు శవం చుట్టూ కూచున్నరు. మొగవాళ్లు బయట అరుగుల మీద, వాకిట్ల గుంపులుగుంపులుగా మాట్లాడుకుంటున్నారు. కొందరు ఇంటికెళ్లి, మరి కొందరు గుడిశెహోటల్కెళ్లి చాయదాగి వస్తున్నారు.

సూర్యుడు నడినెత్తిమీది కొచ్చిండు, అయినా కొందరు శవం లేచేదాకా పచ్చి మంచీనీళ్ళుగూడా ముట్టమని భీష్మించుక్కూచున్నారు....

.....ఇద్దరు పిల్లలు ముద్దు, ముగ్గురు వద్దు... సూత్రాన్ని పాటించిన ధార్మికుడు బొందయ్య కొడుక్కు పట్నం హాస్టల్ ఆశ్రయమిచ్చింది. ఇంటర్ ఫస్టక్లాసులో పాసవగానే అదృష్టం ఇంజనీరింగ్ చదివించి, అట్నుంచి అటే అమెరికా పంపించింది. పాలబుగ్గల పసితనములో పారాడిన తల్లి ఒడిగాని, పల్లెగుడి గాని స్మృతి పథములో నిలువలేదు. మురికి వాడలో అల్లాడిపోతున్న తల్లిదండ్రుల్ని చూస్తే ఆ కొడుక్కెంతో అసహ్యం. అందుకే అమెరికా అమ్మాయినే పెళ్లాడి, అక్కడనే స్థిరపడి పోయిండు. తోడబుట్టిన చెల్లి అమ్మా నాన్నల బాంధాలు గుండెల్లోంచి ఎగిరిపోయినై పెళ్లీడుకొచ్చిన చెల్లికో ఉత్తరం రాయాలన్న ఆలోచన గూడా రాలేదు.

"అదంతా నాల్గు చేతుల సంపాదిస్తున్న డాలర్ల మహిమ" అని బొందయ్య సరిపెట్టుకున్నడు. భార్య సావిత్రి.... గుండెలొల్లిని భరించలేక పోయింది. పేగుబంధం పలవరించింది.

"వాణ్ని మనమేమన్నా గంజివొయ్య మన్నమా! తోడబుట్టి కూడ పెరిగిన చెల్లె పెండ్లి జెయ్యిమన్నమా! కోడల్లోసారి చూపించు మన్నం... గంతేకదా!" అంటూ కంటతడి పెట్టింది.

"పిచ్చిదానా!" బొందయ్యకు పాపమన్పించింది. మనం వాణ్ని కని ఐదేండ్లు పెంచి హాస్టల్ కప్పజెప్పినం. అప్పట్నుంచి వాడెప్పుడన్నా మనింటికి సరిగా వచ్చిండా? పండుగ పబ్బాలకు గిట్లొచ్చి గట్లపోయె. బొందలు తోడుతుంటే మట్టిల రాలిపడ్డ నా చెమట చుక్కల్ని చూసిండా? దండెడ పేనుతుంటే పొక్కులెక్కిన నా చేతుల్ని చూసిండా? ఏదన్నా

సాయం పట్టిండా? మనూరికొస్తే చదువు ఖరాబైతదని మనము అనుకుంటిమి. ఏమైతే ఏందిలే, వాడక్కడ సుఖంగ ఉన్నడు. సల్లగ బతకనీ...." అని ఊరడించి గుండెమంటల్ని చల్లబరి చిండు. కూతురు గురించి....

"మరి గీ సరళ పోరి గూడా మన కడుపుల పుట్టిందే గదా! ఏడోతరగతిలుండగనే పెద్దమనిషాయె. సదువాగిపాయె. ఇంకా రెండు మూడేండ్లన్నా సదివించక పోతిమి. ఆడపోరిని ఇంకో ఊర్లె సదివించాలంటే మనసొప్పకపాయె. ఇప్పుడు దానికి పద్దెనిమిదేండ్లు దాటిపాయె. దాని పెండ్లి ఎట్లా జేస్తవ్?" భార్య బాధ్యత గుర్తు జేసింది. సన్యాసి లెక్క నవ్వి "అంతా ఆ పరమాత్ముని దయ" అని చేతులెత్తి దండ బెట్టిండు.

అంతావిన్న సరళ" ఇది వెనుకటి జమానా కాదు. నా పెండ్లి గురించి తొందర లేదు. మీరు ఫికర్ చెయ్యొద్దు." సముదాయించింది...

లోపలి నుండి సరళ, సావిత్రిల ఏడుపు వినబడతోంది. అరుగుమీది పెద్దమనిషి చుట్టపొగ పీలుస్తున్నడు.

"మరి... బొందయ్యకు బొంద ఎవలో ఒకలు తోడాలె గదా!" విసుక్కుంటూ గుర్తు చేసిండు.

మొగవాళ్లు మొహాలు చూసుకుంటున్నరు. ఏదో కొత్త సంగతి విన్నట్టు కొందరు ఆశ్చర్యపోతున్నారు.

"మనూర్లె బొందయ్య తప్ప ఇంకా ఎవలన్నా బొంద దోడింద్రా?" రుమాలు దులుపుకుని భుజమ్మీదేసుకుంటూ అడిగిండో నడివయసాయన.

"నిజమే కాని వాడు సచ్చిపాయె. ఇప్పుడు ఎవలన్నా తోడక తప్పదు గదా!"

నువ్వంటే నువ్వను కుంటున్నారు. కీచులాడుతున్నారు.

"గీ పని నాకురాదు." అందరి నోట అదేమాట.

"ఓర్నియవ్వ గిదేందిరో!?" అంతా గమనిస్తున్న ఓ ముసలమ్మ ఝూడింపుకు దిగింది. "ఏదన్నా నౌకరున్నదంటే పాంటు, బుస్కోటేసుకుని పదుల మంది వైసుపోరలు ఊరికొస్తరు. తాత ముత్తాతలు చేసిన బ్యాగరి పని చెయ్యమంటే ఏడుస్తరు. ధూనీయమ్మ... దునియా అంతగిట్లనే ఉన్నదా?"

యువకిశోరాలకు నవ్వొచ్చింది గాని పౌరుషం పొంగలేదు. నాలుగైదు. నిమిషాలు మొఖాలు చూసుకున్నారు.

"మరిప్పుడెట్లా?" పెద్దమనిషి పరేశానై పోతున్నడు. "మన కులపోల్లంతా బొందలు తోడాలె. ఎవ్వలూ తోడకపోయిరి. ఒక్క బొందయ్య తోడె. వాని కొడుకేమో కొండంత చదువు జదివి రెక్కలొచ్చి ఎగిరిపాయె. మన కులాచారం కుక్కల పాలయె" గుండెల మీద గుండుసూదులు గుచుకున్నట్టుంది. "అరేయ్! గీ వైసు పిల్లగాండ్లెవలన్నా తోడుండ్రిరా. నా వయసోల్ల నడుములు కూలవడిపాయె. రెక్కలు మూలకుపడె. కిరకిరి ఎందుకురా జెల్దివొయ్యి తోడుండ్రి బిడ్డా" బతిమాలిండు.

అయోమయంగా ముఖాలు చూస్తుకున్నారు యువకులు. కళ్లతో సైగలు జేసుకున్నారు.

"గా పని మాకు రాదని ముందే చెప్పినం గదనే పెద్దమనిషీ! మల్లా మా తెరువొస్తే మర్యాదగుండది." అందరి తరపున ఒక్కరి వార్నింగ్.

పెద్దమనిషిలో ఆశ చావలేదు. అతని చూపులు ప్రౌఢులను తడుముతున్నై. బేజారైంది. ప్రౌఢులకు.

"నువు గట్ల జూస్తే మాకు భయమైతదే పెద్దమనిషీ" ఓ ప్రౌఢశిఖామణి పౌరుషం." నీ బుద్ధి బొందలవడంగా బొంద దోడుడు మాతోనైతదా? కానేకదు." తెగేసి చెప్పి కాండ్రించి ఉమ్మేసిండు.

ఆడవాళ్లు గొల్లుమన్నరు. శవాన్ని జాలిగా చూస్తున్నారు.

"ఎందరికో బొందలు తోడితివయ్యా. నీకు బొంద ఎవలు తోడుత రయ్యా?.." సావిత్రి పాత్తికడుపులో సప్త సముద్రాలు పొంగుతున్నై, భర్త శవమ్మీద వాలి శోకాలు దీసింది.

"పీనుగు వాసన పడ్తుంది. జెల్ది కానియ్యండ్రి." ఓ ముసలమ్మ ముక్కు మూసుకుంది. సరళ పక్కనున్న యువతి బయట కొస్తూ.

"గీ మొగోల్లు, మొనగాల్లంతా ఏంజేస్తున్నరు? బొందు దోడుడు అదేమన్నా బ్రమ్మ విద్యనా?" కన్వింపుగా చూస్తుంది.

"గడ్డపార, పార, తట్ట పట్టుకుని బొందల గడ్డకు వోతే అక్కడనే తెలుస్తదంత." వయసు పొంగులమీది కొంగును సవిరించుకుంది.

"గట్టనంగనే గిట్ట పనైతదా?" మరో యువకునికి రోషం ఇంజెక్ష నిచ్చినట్టయింది." డిగ్రీలు చదువుకున్న మేము బొందలు తోడెతందుకే పనికొస్తమా?" సవాలు విసిరిండు.

"కాదు." అదే యువతి మూతి మూడు వంకర్లు తిరిగింది. "పూటకు తల్లెడు దిని ఊరుమీద బలాదూర్ తిరిగెతందుకే పనికొస్తరు." చేతులు తిప్పేసింది. "మరైతే పీనుగు ఇంట్లనే ఉంటదా?" సూటిగా ఆడిగింది. కొంగు నడుముకు బిగించుకుంటూ "మీకు చాతగాకపోతే చెప్పుండ్రి." ఛాలెంజి విసిరింది.

తర్జన బర్జనలు తారాస్థాయికి చేరుకున్నై. సరళ గుండెతడి ఆరలేదు. పరిపరి విధాల పరితపిస్తుంది... మా నాయన మంచోడే గదా. ఎవ్వలకేమీ నష్టం జెయ్యలేదుగదా. చాతనైన సాయం జేసిండు... బొంద ఎవ్వలూ తోడమంటే ఎట్లా... ఆలోచన ధైర్యంగా రూపుదిద్దుకుంటుంది.

"నీ యవ్వ బొంద దోడుడంటే మాటలా, మజాకా!" మరో యువకుని సవాల్.

"కాదు." చేతులు, మాటలు కోటలు దుంకుతైకాని కాళ్లు తంగెల్లు దాటయి." యువతి వెక్కిరింపు.

"మరి గీలొల్లి ఎందుకు? చేతులల్ల చూపించు చాతనైతే." యువకుడు నవ్వబోయి, సరళమొహంల మార్పులు జూసి మానుకున్నడు. సరళ గుండె గుండ్రాయిలా తయారైంది.

.... అమ్మ మంగళ సూత్రాలు నాయిన మందులకే అమ్మితిమి. అమ్మ మెడలున్నది పసుపుకొమ్మేనాయె.

ఇప్పుడు చేతిల ఒక్క రూపాయిగూడా లేదు. నాయినకు తలకొరిని పెట్టాల్సిన అన్నయ్య అమెరికాలనే ఉండె. కనిపెంచిన తల్లిదండ్రులు వానికి బరువైపోయిరి.... సరళ కంటి ధారలు కపోలాలను తడిపేస్తున్నాయి. కాని... మొండి ధైర్యంతో ముందుకు కదిలింది.

ఇప్పుడేం. జెయ్యాలె? నా సంగతేంది? పెండ్లి కావల్సిన బిడ్డ సరళ సంగతేంది?.. సావిత్రి గుండె చెరువైపోతుంది. శవం పక్కన గోడకొరిగి - మోకాళ్ల మధ్య గదవ ఆనించి కూచుంది.

బయట బొంద తోడుడు గురించి చర్చలింకా ఓ కొలిక్కి రాలేదు. ఎలాగైనా సరే యువకుల చేత బొంద తోడించాలని ప్రౌఢుల పట్టుదల. శవానికి దహన సంస్కారము చేయించాలనే యువకుల ఆరాటానికి ఆవేశం జోడై ఆలోచనకు తావియ్యడం లేదు. శవదుర్గంధం ఇల్లంతా వ్యాపించింది. దగ్గరున్నవారి ముక్కు పుటాల నదర గొడుతుంది.

"బొంద దోడుడు మాతోని కానేకాదు. ఏంజేసుకుంటరో చేసుకోండ్రి." యువనాయకుడు తేల్చిపారేసిండు.

"మేమెప్పుడూ బొంద తోడలేద. ఇప్పుడు తోడం." ప్రౌఢనాయకుని తెగింపు.

"అయితే గడ్డపార, పార, తట్ట పట్టుకుని నా ఎంబడి రాండ్రి. ఎట్ల తోడాలనో నేను చూపిస్త." పెద్దమనిషి తల బాదుకున్నడు.

"మేమెందుకు? బొందల గడ్డకు వొయి నువ్వేతోడు తాతా!" యువకుని నిరసన.

"నాకు శక్తి లేదు. వైసుడిగి పోయిందిరా!"

అందరిలో అసహనం అంగలేస్తుంది. ఆకలి కేకలు అల్లరి పెడుతున్నై. అరుగుల మీంచి లేచి కొందరు వెళ్లి పోవాలనుకుంటున్నరు.

సరళ కృతత నిశ్చయంతో బయటికొస్తుంది. మొహం గంభీరంగా ఉంది. ఎర్రని ఒంటిరాయి ముక్కుపుడక కొత్త మొగులు విరజిమ్ముతూంది కొంగు నడుముకు బిగించి ఉంది. నుదుటి. మీద ముందురులు గాలితో ఆడుకుంటున్నై నల్లని కను బొమల మధ్య ఎర్రని బొట్టు ఉదయసూర్యనిలా కనబడుతూంది. ఎడమభుజమ్మీద పార, గడ్డపార.. కుడి చేతిలో తట్ట.. నిర్భయంగా బయటికొచ్చింది. నేరుగా బొందుల గడ్డవైపు నడుస్తూంది.

పెద్దమనిషి లేచి ఆమెననుసరిస్తున్నడు.

**ప్రజాతంత్ర డిసెంబర్ 19-25, 2004**

